ఆంధ్రజ్యోతి వీక్లీ – 'న్యూజెర్సీ' కథల పోటీలో ఉత్తమంగా ఎంపికై
బహుమతి గెలుచుకున్న కథ

# దొంగ బతుకు



**ఆ**కాశం గుండె బ్రద్దలైనట్టు కుంభవృష్టిగా కురుస్తోంది వర్షం. మనుషుల మనస్సుల్ని శుద్ధి చేయాలన్న దీక్షతో కాబోలు కసికసిగా కురుస్తోంది.

'గాలివోన పట్టిందా ఏంట్రా భగవంతుడా' రొయ్యల చెరువు గట్టుమీదున్న చిన్న పాకలోంచి బిక్కుబిక్కుమని బయటికి చూస్తూ అనుకున్నాడు వెంకన్న.

రెండ్రోజుల్నుంచి వర్షం విడవకుండా కురుస్తోంది. గాలి ఉధృతంగా వీస్తూ పాకని కుదిపేస్తోంది. ఈడ్చికొడుతోన్న చలిగాలిని తట్టుకోవడానికి గోనె పట్టాని కప్పుకుని చుట్ట వెలిగించాడు. కడుపులో ఎలుకలు పరుగులు పెడుతున్నాయి.

రొయ్యల చెరువుకి కాపలా కాస్తూ పాకలో పడున్నాడు. ఇంటి దగ్గర్నుంచి భార్యో, కొడుకో అన్నం మూట తెస్తుంటారు. కానివాళ వర్ష తీవ్రత ఎక్కువగా వుండడం వల్ల ఎవరూ రాలేదు.

అయినా ఆకలి గురించీ అది తీరేమార్గం గురించీ ఆలోచించడం లేదు వెంకన్న

చెరువులో పంటకొచ్చిన రొయ్యలున్నాయి. నాలుగైదురోజుల్లో పట్టి అమ్మెయ్యాలని రాయుడుగారు చూస్తున్నారు. అటువంటి సమయంలో అదేపనిగా కురుస్తోంది వర్షం. వర్షం వల్ల చెరువులో ఉప్పదనం తగ్గి రొయ్యలెక్కడ తేలిపోతాయోనని భయంగా వుంది. ఇలాగే మరి రెండ్రోజులు వర్షం కురిస్తే గట్లు తెగి ముంపువచ్చి ఆ ప్రాంతమంతా ఏకఖండమైపోతే చేతికందిన లక్షల పంట చేజారిపోతుందేమోనని ఆందోళనగా వుంది.

"అంతరేది నర్సింహసామీ! ఈ చెరువునీ రొయ్యల్నీ సల్లగా కాపాడు తండ్రీ" చేతులు జోడించి ప్రార్థించాడు.

ఉరుము వురిమింది. అతడి ఒళ్ళు గగుర్పొడిచింది. ఎక్కడో పిడుగు పడింది. అతడి గుండెలు గుభిల్లుమన్నాయి.

'బ్రహ్మంగారన్నట్టు ప్రళయం వచ్చేత్తదా ఏంట్రా దేవుడా!' అనుకున్నాడు.

భార్యాబిడ్డలు గుర్తొచ్చారు. ఇంటికప్పు నేయించని సంగతీ గుర్తొచ్చింది.

'గుడిసెలో వర్షం కురిసేస్తోందో ఏవో. ఏం అవస్థలు పడుతన్నారో ఏవో! ఓపాలి సూసొత్తే బావుణ్ణు....' అనుకున్నాడు. కాని చెరువు వదిలెళ్ళడానికి మనస్కరించలేదు.

ఏ గట్టో తెగితే, దొంగలొచ్చి వలవేస్తే యజమానికి చాలా నష్టం వస్తుందని భయపడ్డాడు. తనని నమ్మి కాపలా పెట్టుకున్నందున త్రికరణశుద్ధిగా ఆ పనిచెయ్యడం తన బాధ్యత. పైగా చెరువులో ఈ ప్రక్క రెండెకరాలూ ఇప్పుడు రాయుడిదైనా ఒకప్పుడు తనదేకదా అనుకున్నాడు. ఆ బంధం దృష్ట్యానైనా చెరువుని అంటి పెట్టుకునుండాలనుకున్నాడు వెంకన్న.

గతం గుర్తొచ్చింది

రెండేళ్ళ క్రితం వరకూ తనూ చిన్నకారు రైతే. కుటుంబమంతా ఆరుగాలం కష్టించి

పండించే రైతే. రాయుడి గారి సరిహద్దులో ఉంది తన పొలం. పొలంలో పొలం గనుక అమ్మెయ్యమన్నారు. తనొప్పుకోలేదు.

ఆయన చెరువు తవ్వి రొయ్యలు పండించి లక్షలార్జిస్తోంటే తను వరి నాటి 'ఉప్పు' పండించాడు. తనూ చెరువు తవ్వకపోతే మనుగడ వుండదని గ్రహించక తప్పలేదు. అప్పుకోసం చెప్పులరిగేలా తిరిగాడు. అప్పు పుట్టలేదు.

రాయుడుగారే పుట్టనివ్వలేదంటారు తన కొడుకులు. ఆఖరికి పొలం అమ్మేద్దామని బేరం పెట్టినా రాయుడిగారికి భయపడి ఒక్కరూ ముందుకి రాలేదు.

మరి గత్యంతరం లేక రాయుడిగార్ని బ్రతిమాలి అమ్మాల్సిన దౌర్భాగ్యస్థితి దాపురించింది. ఎకరం లక్ష చేసే పొలాన్ని యాభైవేలకి కొనేసి కలిపేసుకున్నారు. పొలం సొమ్ము అప్పు, వడ్డీలకి సరిపోయింది.

పంటపొలం రొయ్యల చెరువుగామారిపోయింది.

రైతు కూలీగా మారిపోకతప్పిందికాదు.

నిట్టూర్చాడు వెంకన్న.

రాయుడుగారు రొయ్యల చెరువు తవ్వకుండా వుంటే, తన పొలంలో పంట చక్కగా పండేది. ఈ సరికి అప్పుతీర్చేసేవాడు. చేతికందొచ్చిన కొడుకులు రెండెకరాల్ని నాలు గెకరాలు చేసేవారేమో కూడా. ప్చ్..... అంతా మంత్రం వేసినట్లు మాయమైపోయింది. సరైన కూలి కూడా దొరకని స్థితి వచ్చి పడింది!

రొయ్యల చెరువుల ఆసాములు రెండుచేతుల్తో లాభాలార్జిస్తోంటే, చిన్నా చితకా రైతులూ కూలీలూ కూలి దొరక్క అలమటిస్తున్నారు. ముందు ముందు ఏం కానుందో!

ప్రక్క చెరువు కాపలామనిషి రాములు వచ్చాడు. చేతిలో తాటాకు గొడుగున్నా నిలువునా తడిసిపోయాడు.

"లెగరా ఎంకన్నా ఎల్లిపోదాం రా"

"చెరువు నొదిలి రాన్రా. అసలే దొంగనాయళ్ళెక్కువై పోయారు. నాలుక్కేజీలట్టుకుపోతే ఎయ్యిరూపాయిలకి కాళ్ళొచ్చేసినట్టే"

"వత్తే రానీరా. ఇక్కడే వుంటే ఈ సలికి సావన్నా సత్తాం వరదలో కొట్టుకన్నాపోతాం. నానెల్లిపోతన్నాను నీ ఇట్టం మరి"

వెంకన్న జవాబివ్వలేదు. అతడెళ్ళిపోయాడు.

గాలీ వానా మరింత అధికమయ్యాయి.

రాముల్తోబాటు వెళ్ళిపోవాల్సిందేమో! ఇల్లెలా వుందో ఏమో! గుడిసె కప్పుగాని జారిపోలేదు కదా?'

గుండె ఝల్లుమంది

కప్పు బాగుచెయ్యాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నా డబ్బు సర్దుబాటు గాక వూరుకుండిపోయాడు. ఖర్మకాలి కప్పుకూలిపోతే పొలంలానే ఇల్లు కూడా....!

మరి నిలవలేకపోయాడు వెంకన్న. ఒక్కసారి గుడిసెలా వుందో చూసి రెండు మెతుకులు నోట్లో పడేసుకుని ఇక్కడున్నట్టుగా రావాలని బయల్దేరాడు.

త్రోసేస్తోన్న గాలిని లెక్కచెయ్యకుండా వడివడిగా అడుగులేశాడు ఊరివైపు.

మేడమీద గదిలో కిటికీ ప్రక్కన కూర్చుని వేడివేడి పకోడీలు తింటూ భార్యతో కబుర్లు చెబుతూ బయటికి చూస్తోన్న రాయుడి దృష్టిలో పడ్డాడు వెంకన్న. ఉవ్వెత్తున కోపం పొంగి వచ్చేసిందొక్కసారే.

"ఒరేయ్ – వెంకన్నని ఈడ్చుకు రండ్రా"

అయిదు నిమిషాల్లో లాక్కొచ్చారతడ్ని.

నిలువునా తడిసి ముద్దై బిక్కుబిక్కుమంటూ రాయుడిగారి మేడలోకి ప్రవేశించాడు వెంకన్న.

"ఏరా దొంగనాయాల. నువ్వెంతో మంచోడివని నమ్మి, పదెకరాల రొయ్యల చెరువుని నీ చేతిలో పెడితే, చెరువుని గాలికొదిలి పెళ్ళాం పక్కలో వెచ్చగా పడుకుంటావా లమ్డీకొడకా" రౌద్రులయ్యాడు రాయుడు.

"రామ రామ. ఇప్పుడే గుడిసె కప్పెలాగుందోనని వచ్చేనండి...."

"నోర్మొయ్యరా. నీ నక్క వినయాలు నా దగ్గర కాదు. నిన్న రాత్రి మూడుకేజీల రొయ్యలు దొబ్బి అమ్మేవా లేదా? ఎవడబ్బ సొమ్మనుకున్నావురా పుండాకోర్"

"మా అయ్యతోడు – నేనట్టాటోడ్ని కానండి...."

"దొంగతనం చేసిందిగాక అబద్ధాలొకటా. ఒరేయ్ వాడ్ని స్తంభానికి కట్టెయ్యండ్రా. తాటవొలిస్తే గాని నిజం చెప్పడు"

"నేను దొంగని కానండి. నా పేణాలైనా ఇత్తానుగాని దొంగననమాకండి" బాధతో సుళ్లుతిరుగుతూ కాళ్లమీద పడ్డాడు.

"ఛా– నీయమ్మ!" అంటూ చెప్పుకాలితో తన్నారు. ఎగిరెళ్ళి పడ్డాడు వెంకన్న. రాయుడిగారి భార్యా, నౌకర్లూ మౌన ప్రేక్షకుల్లా గుడ్లప్పగించి చూస్తుండిపోయారు.

"అమ్మా' మీరైనా చెప్పండమ్మా నేను దొంగని కాదు. నమ్మిన భూమ్మీదా తినే అన్నంమీదా ఒట్టేసి సెబుతున్నారు. నన్ను తిట్టండి కొట్టండి సంపండి కాని దొంగనన కండమ్మా నేను దొంగని కాదు. నాది దొంగ బతుక్కాదు...." అభిమానంతో దహించుకుపోతూ కాళ్ళని చుట్టేశాడు.

ఆవిడ దూరంగా జరగ్గా, రాయుడిగారి కాళ్ళమీద పడ్డాడు. గొంగళి పురుగులా విదిలించేశారాయన.

"ఫోరా ఫో. పోయి కుక్కలా కాపలా కాయి. మళ్ళీ ఒక్క రొయ్యి దొంగతనం చేశావో నిన్ను ప్రాణాల్తో వదల్ను. నేను దేన్నైనా సహిస్తాను కాని దొంగతనాన్ని సహించనొరేయ్. ఫోరా..."

తలూపి కళ్ళు తుడుచుకుంటూ ఎక్కుపెట్టి విడిచిన బాణంలా వర్షంలోకి దూసుకుపోయాడు వెంకన్న.

నౌకర్లు వెళ్ళేక మెల్లగా అంది రాయుడి గారి భార్య – "బతికి చెడ్డవాడు వెంకన్న. రొయ్యల్ని దొంగిలించాడంటే నమ్మలేకపోతున్నాను"

"నా చెరువులో దొంగతనం చేసి బతగ్గలడనే?" చిత్రంగా నవ్వేరు

"మరి....?"

"వూరికే బెదిరించానంతే"

అర్థం కానట్టు చూసింది.

"వెంకన్న లాటి వాళ్ళు అభిమానం కోసం ప్రాణాలైనా ఇస్తారు. ఆ అభిమానానికి దెబ్బతగిలేలా మాట్లాడేమనుకో మెప్పించడానికి కుక్కలా పడి వుండి ఎద్దులా పనిచేస్తారు. మనల్నీ మన ఆస్తుల్నీ చల్లగా కాపాడతారు"

చిద్విలాసంగా నవ్వేరు రాయుడు మీసాలు సవరించుకుని !

* * *

**(ఆంధ్రజ్యోతి వారపత్రిక 7-2-1997)**